# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-08-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ మహిళల పురోగతికి, సంక్షేమానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.
- ❖ ఒక నెల-ఒక నియోజకవర్గం-నాలుగు సందర్శనలు కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.
- ❖ ఉపరితల ఆవర్తన ప్రభావంతో పశ్చిమ బెంగాల్-ఉత్తర ఒడిశా తీరాలపై రేపు అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచేందుకు నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్ అమలుపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఈరోజు జరిగిన సమీక్షలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నియోజక వర్గాల వారీగా విజన్ ప్లాన్ రూపొందించుకుని పని చేయడం దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో అమలు చేస్తున్నామని, దీనికి జాతీయ స్థాయిలో మంచి పేరు వచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ క్రమంలో నియోజకవర్గాల విజన్ ను సమర్థవంతంగా అమలు చేయాలని, విజన్ ప్లాన్ అమలులో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలది కీలక పాత్ర అని పేర్కొన్నారు. నియోజకవర్గాల విజన్ ప్లాన్ అమలు పనితీరుకు ప్రామాణికమన్న ముఖ్యమంత్రి.. విజన్ ప్లాన్ పై ప్రజా ప్రతినిధులు నిరంతరం సమీక్షించాలని స్పష్టం చేశారు.

=====================

ఎక్కడికి వెళ్లినా తెలుగు ఆడపడుచులు చూపే ప్రేమాభిమానాలు ఎప్పటికీ మరవలేనివని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పర్యటనకు వచ్చిన ఆయనకు స్థానిక శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ ఘనస్వాగతం పలికి.. రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మహిళల భద్రత, వారి సాధికారతకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహిళల పురోగతికి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రక్షా బంధన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలోని మహిళలందరికీ కందుల దుర్గేష్ శుభాకాంక్షలు తెలిపారు.

=====================

ప్రజాఫిర్యాదుల పరిష్కారానికి ఇప్పటికే ఫిర్యాదుల దినోత్సవం నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కాన్స్టిట్యుఎన్సీ విజన్ యాక్షన్ ప్లాన్ (CVAP)ని ప్రతి నియోజకవర్గంలోను అందుబాటులోకి తీసుకువచ్చింది. గుంటూరు జిల్లాలో తొలి CVAP కార్యక్రమాన్ని తెనాలి పట్టణంలో ఈరోజు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సాంకేతికత సహకారంతో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సున్నా ఫిర్యాదులు వచ్చే దిశగా పరిపాలన కొనసాగిస్తున్నామని చెప్పారు. 'ఒక నెల–ఒక నియోజకవర్గం–నాలుగు సందర్శనలు' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

=====================

మహనీయుల జీవితాలు, సేవలు, స్ఫూర్తిదాయక ఆలోచనలు నేటి యువతకు, భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రకాశం జిల్లా పర్యటనలో భాగంగా ఆయన.. ఒంగోలు 150 వసంతాల ఉత్సవాల సందర్భంగా ఒంగోలు అభివృద్ధికి కృషి చేసిన 20 మంది మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించారు. మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, మహనీయుల త్యాగాలను భావితరాలకు పరిచయం చేయడమే లక్ష్యంగా విగ్రహాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సామాజిక, సాంస్కృతిక, విద్యా, రాజకీయ, సాహిత్య రంగాలకు చెందిన 20 మంది ప్రముఖుల విగ్రహాలు ఒంగోలుకు మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. ప్రకాశం జిల్లా సంస్కృతి, పశుసంపదకు ప్రతీకగా ఒంగోలు గిత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సముచితమని వ్యాఖ్యానించారు.

విరామం

=====================

డ్రగ్స్ వద్దు.. క్రీడలు ముద్దు డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ ఎ. రవినాయుడు పిలుపునిచ్చారు. తిరుపతిలో ఈరోజు డ్రగ్స్ వద్దు.. క్రీడలు ముద్దు.. నినాదంతో జరిగిన భారీ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అమరావతి ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న క్రీడాకారులు సామాజిక బాధ్యతతో కూడిన డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణ, ఫిట్‌నెస్‌కు ప్రతీకలుగా, యువతకు ఆదర్శంగా నిలుస్తూ.. సమాజంలో మంచి మార్పు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించగలరని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు, చట్టపరమైన చర్యలు చేపడుతున్న నేపథ్యంలో క్రీడాకారులు తమ మద్దతు అందించారని అన్నారు.

=====================

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో అబార్షన్ వికటించి ఓ మహిళ మృతి చెందిన ఘటనపై విచారణ జరుపుతామని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ వెల్లడించింది. వైద్యుడు ఫోన్‌లో సలహాలు ఇస్తుండగా, సిబ్బందితో అబార్షన్ ప్రక్రియ

నిర్వహించినట్టు వచ్చిన వార్తలపై కౌన్సిల్ స్పందించింది. మండలిలో అంతర్భాగంగా ఉన్న యాంటీ క్వాకరీ కమిటీ ద్వారా ఘటనకు సంబంధించిన వాస్తవాలను నిర్ధారించి, కౌన్సిల్‌కు ఉన్న అధికారాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని ఛైర్మన్ డాక్టర్ గార్లపాటి నందకిశోర్ తెలిపారు. ఈ ఘటన అత్యంత విషాదకరమని, అనధికార వైద్య చర్యలను ఉపేక్షించేది లేదని ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

======================

ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో పీజీ వైద్య విద్యార్థుల విధుల నిర్వహణ, డ్యూటీ రోస్టర్లు, సెలవుల విషయంలో అమలులో ఉన్న నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ విష్ణువర్ధన్ స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేశారు. పీజీ వైద్య విద్యార్థులకు వారానికి 74 గంటలకు మించి విధులు కేటాయించరాదని, ప్రతి పీజీ విద్యార్థికి వారానికి ఒక పూర్తి రోజు సెలవు తప్పనిసరిగా ఇవ్వాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రాత్రి డ్యూటీ చేసిన పీజీ విద్యార్థికి మరుసటి రోజు తప్పనిసరిగా సెలవు ఇవ్వాలన్నారు. పూర్వ ఉత్తర్వులను అమలు చేయకపోతే ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

======================

ఉత్తర బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్-బంగ్లాదేశ్ తీరాలపై సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో వాయువ్య బంగాళాఖాతంలోను, పశ్చిమ బెంగాల్-ఉత్తర ఒడిశా తీరాలపై రేపు అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఫలితంగా ఉత్తర కోస్తాంధ్రలో రేపు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది.

======================

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో లెగసీ వేస్ట్ తొలగింపు, ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్ల ఏర్పాటు పనులపై ఈరోజు సమీక్ష నిర్వహించారు.

======================
======================